క్లుప్తంగా

ఘనంగా దత్త జయంతి

కొయ్యూరు: సింగవరం షిరిడిసాయిబాబా ఆలయంలో సోమవారం దత్త జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ముందుగానే దత్త జయంతిపై ప్రచారం చేయడంతో అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, కళ్యాణం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశం

చింతూరు: పార్టీకి చెందిన వివిధ మండల విభాగాల అధ్యక్షుల నియామకం నిమిత్తం మంగళవారం చింతూరులో వైఎస్సార్‌సీపీ మండల కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి సోమవారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు సర్పంచ్ కారం కన్నారావు ఇంటివద్ద సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు, మహిళా అధ్యక్షురాలు, బీసీ, ఎస్టీ, మైనార్టీ, బూత్ లెవల్ అధ్యక్షుల ఎన్నిక ఉంటుందన్నారు. సమావేశానికి పార్టీ ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని రామలింగారెడ్డి కోరారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అడ్డతీగల: మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి వారి ఆలయం నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అభయాంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తొలిత స్వామి వారికి అభిషేకం జరిపారు.అనంతరం నూతన వస్త్రాలు ధరింపచేసి వివిధ పుష్పాలతో స్వామి వారిని ఆలంకరించారు. సాయి భజన మండలి, లలిత సత్సంగ సభ్యులు భక్తి గీతాలాపన చేశారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేస్తున్న జేసీఎస్ కన్వీనర్ బాబీ

మారేడుమిల్లి: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు, జేసీఎస్, మండల కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ) ఆధ్వర్యంలో సోమవారం పేదలకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. జి.కిషోర్ కుమార్, జి.కరుణాకర్, బి.తిత్వదాసు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర సరకుల వితరణ



బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేస్తున్న భవానీ మాలధారులు

వీఆర్ పురం: ఇటీవల సీతంపేటలో విద్యుదాఘాతం వల్ల గృహ దగ్ధంలో సర్వం కోల్పోయిన ముత్యాల చిన్న వెంకటేష్, అలాగే పెదమట్టపల్లిలో అగ్నిప్రమాదం సంభవించి గృహం కోల్పోయిన పండా ముత్తయ్య కుటుంబాలకు సోమవారం గురు మాత పార్వతి వర్ధిని సహకారంతో ఆదివాసి భవానీ మాలధారులు బియ్యం, నిత్యావసర సరకులను వితరణగా అందచేశారు. ఎస్.కన్నంరాజులు, చందు, వెంకయ్య, మల్లయ్య, నాగేశ్వరరావు, నరేష్ , నరసింహారావు, కె.కన్నంరాజులు, రాజు, సత్యనారాయణ, రాజేశ్వరి , శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సేవా నిలయాలు

- సచివాలయాలతో ప్రజల ముంగిటకే పాలన
- అందుబాటులో 12 శాఖల సిబ్బంది
- ఆనందంలో మండలవాసులు





పనసలపాలెంలోని గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వై.రామవరం మండలం పి.యర్రగొండ గ్రామ సచివాలయం

మండలం : వై.రామవరం

పంచాయతీలు 17	సచివాలయాలు 18
గ్రామాలు 139	పూర్తయినవి 18
ఒక్కొక్క సచివాలయానికి ఖర్చు రూ. 48 లక్షలు	
సచివాలయ భవన నిర్మాణాలకు మొత్తం కేటాయింపు 8.40 కోట్లు	
సచివాలయ సిబ్బంది 216 మంది	వలంటీర్లు 150 మంది

వై.రామవరం: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ స్థాయిలో ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి చేకూరేలా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ మంచి ఫలితాలు ఇస్తోంది. రేషన్ కార్డు మొదలు కొని పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అలాగే ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా ఈ వ్యవస్థ దోహదపడుతుంది. గతంలో ఏ పని కావాలన్నా ప్రజలు సుదూరాన ఉన్న మండల కార్యాలయాలకు కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. అటువంటి అవస్థలకు చెక్ పెటేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలను గ్రామ స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా నేడు అడుగులు పడుతున్నాయి.

సేవలన్నీ ఒకేచోట

మండలంలోని 17 సచివాలయాల నూతన భవనాలు తుదిమెరుగులు దిద్దుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. 17 సచివాలయాల పరిధిలోను 139 గ్రామాలు ఉన్నాయి. జిల్లాలో అన్ని మండలాలకంటే వై. రామవరం మండలం ఎక్కువ విస్తీర్ణంలో ఉంది. ఒడిశా రాష్ట్ర సరిహద్దు వరకు వ్యాపించి ఉంది. గతంలో మండల కేంద్రానికి వివిధ ప్రభుత్వ కార్యాలయాల పనులపై మండల లోతట్టు ప్రాంతం నుంచి వచ్చి వెళ్లాలంటే రెండు రోజులు పట్టేది. వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగాల్సి ఉండేది. అయితే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక సచివాలయ వ్యవస్థను, గ్రామ వలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేయడంతో ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి. మండల కేంద్రానికి వెళ్లనవసరం లేకుండా అన్ని సేవలు గ్రామ వలంటీర్ల ద్వారా సచివాలయాలలోనే లభిస్తుండడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వం చేయలేని ఈ వ్యవస్థను ఏర్పాటు చేసి, మెరుగైన సేవలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మండలవాసులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



యార్లగెడ్డలోని గ్రామ సచివాలయం

టైప్ 1, టైప్–2 భవనాలు

ప్రజలకు సకాలంలో సత్వర సేవలే లక్ష్యంగా ప్రతి రెండువేల జనాభాకు ఒక సచివాలయం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందుకోసం కోట్లాది రూపాయలు వెచ్చించి పరిపాలనా పరమైన ఇబ్బందులు లేకుండా తగు భవనాలు నిర్మించారు. టైప్–1 భవన నిర్మాణాలకు రూ.48 లక్షలు, టైప్–2 భవనాలకు రూ.25లక్షల వంతున నిధులు మంజూరు చేస్తున్నారు. 12 మంది సిబ్బంది పలు శాఖలకు సంబంధించి సేవలందించేలా వ్యవస్థను కట్టుదిట్టం చేశారు. వలంటీర్ల సహకారంతో ప్రజలకు అవసరమయ్యే సేవలను సకాలంలో అందిస్తున్నారు.

సేవలిలా...

- విద్యార్థులకు అవసరమయ్యే పలురకాల ధ్రువీకరణ పత్రాలు
- ప్రజలు ఇంటివద్ద నుంచే దరఖాస్తు చేసుకునేలా గ్రామ సచివాలయాల వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచారు.
- గ్రామ సచివాలయాల ద్వారా 520 రకాల సేవలు
- దరఖాస్తుదారుల్లోని అర్హులకు బియ్యం కార్డులతో పాటు పింఛన్‌లు, ఆరోగ్య శ్రీ కార్డులు
- మ్యుటేషన్లు, సదరం దరఖాస్తులు, రేషన్‌కార్డుల నమోదు,విద్యుత్ కనెక్షన్‌లకు సంబంధించిన కేటగిరీలో మార్పులు, అడంగల్, ఆధార్ కార్డులు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, కాపు నేస్తం, చేయూత, ఆసరా, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ప్రభుత్వ గృహాలు, వాహనమిత్ర వంటి సేవలు ఒకేచోట అందుతున్నాయి.

సకాలంలో అన్ని సేవలు



సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సకాలంలో అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నాం. గ్రామ వాలంటీర్లు, సిబ్బంది ఆధ్వర్యంలో మండల ప్రజలకు అన్నిరకాల సేవలు అందిస్తున్నాం. సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలన్ని ప్రజల చెంతకే అందుతున్నాయి. సిబ్బంది అందుబాటులో ఉండి అన్ని విధాలుగా సేవలందిస్తున్నారు.

– డి శివకుమార్, ఈఓపీఆర్‌డి వై.రామవరం

అన్ని ధ్రువపత్రాలు అందుతున్నాయి



ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ భేష్‌గా ఉంది. సచివాలయం ద్వారా మాచదువులకు సంభం ధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందుతున్నాయి. ఈవ్యవస్థను ఎప్పటికీ ఇలానే కొనసాగించాలని జగనన్నను కోరుకుంటున్నాం. రాబోయే ఎన్నికల్లో కూడ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం.

– ముర్ల వెంకటరత్నం, విద్యార్థిని, వై.రామవరం

సీఎం జగనన్నకు కృతజ్ఞతలు



గామ వలంటీర్లు, సచివాలయం ద్వారా అన్ని సేవలు అందుతున్నాయి. ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ పథకాలు సచివాలయం ద్వారా అందుతున్నాయి. ఈ వ్యవస్థను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు. మాకు అమ్మఒడి పథకం ద్వారా సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అయ్యింది. తిరిగి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని భగవంతున్ని కోరుకుంటున్నాం.

– రాపేటి వీరలక్ష్మి , వై.రామవరం

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- వాడవాడలా సేవా కార్యక్రమాలు
- చిన్నారుల సందడి



అరకులోయలో చిన్నారులకు స్వీట్లు పంచుతున్న మాణిక్యం, జ్ఞానమ్మ దంపతులు



దుంబ్రిగుడ సీయోను చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ మానసయ్య



హుకుంపేటలో క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు



ముంచంగిపుట్టు చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు



చింతపల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్



రచ్చపల్లిలో క్రీస్తు సందేశాన్ని వివరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి

అరకులోయ రూరల్: అల్లూరి జిల్లాలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. చర్చిలన్నీ క్రైస్తవ సోదరులతో కళకళలాడాయి. కొత్త దుస్తులు ధరించి ఉదయాన్నే చర్చిలకు తరలివచ్చారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు సందేశాన్ని తెలియజేశారు. క్రీస్తు జీవనం మానవాళికి ఆచరణీయమన్నారు. ఏసు బోధనలు అనుసరణీయమన్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. క్రీస్తు గీతాలు ఆలపించారు. చిన్నారులు సందడి చేశారు. విందు భోజనం ఏర్పాటుచేశారు. ఒకొరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పేదలకు దుస్తులు, రగ్గులు, చీరలు పంపిణీ చేశారు. క్రైస్తవ సోదరుల ఇళ్ల క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లు విద్యుత్ దీపాలతో అలంకరించారు. పండగను పురస్కరించుకొని ఇళ్లల్లో ప్రత్యేక వంటకాలు, ప్లమ్‌కేక్‌లు, ఇతరత్రా వంటకాలు చేసి బంధు, మిత్రులను ఆహ్వానించి విందు భోజనం ఏర్పాటుచేశారు. ఆనందోత్సహాల నడుమ క్రిస్మస్ వేడుక ఘనంగా జరిగింది. అరకులోయ మండలంలో కొత్తభల్లుగూడలోని చర్చిలో హెచ్‌జేసీఎం డైరెక్టర్ మాణిక్యం, జ్ఞానమ్మ దంపతుల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. పాస్టర్లు జక్కయ్య, రాజేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని మర్ధగుడ, అనంతగిరి, కొండిబ, ములియగుడ, హెక్దాగుడ, శివలింగపురం చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

హుకుంపేట: మండలంలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని క్రీస్తు గీతాలు ఆలపించారు.

దుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ, కించుమండ తదితర గ్రామాలతో పాటు దుంబ్రిగుడ సీయోను చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ మానసయ్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ముంచంగిపుట్టు: మండలంలో పలు గ్రామాల్లో చర్చిల్లో చిన్నారులు క్రీస్తు గీతాలకు నృత్యాలు చేశారు. నాటికలు ఆకట్టుకున్నాయి. పాస్టర్లు మోహన్‌రావు, సురేష్, బర్నబస్, ప్రసాదరావులు ఏసు క్రీస్తు సందేశాన్ని వినిపించారు.

చింతపల్లిరూరల్: మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పిల్లలు ప్రత్యేక నాటికలు ప్రదర్శించారు.

జి.మాడుగుల: క్రీస్తు జీవితం అనుసరణీయమని, ఏసుక్రీస్తు ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చిన మహనీయుడని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని రచ్చపల్లి చర్చిలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. పాస్టర్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి. ఆదివాసీ ప్రభావిత పథం చర్చిలో పాస్టర్ జర్రా సుబ్బారావు, చుట్టుమెట్టలోని చర్చిలో పాస్టర్ తిమోతి కేక్‌లను కట్ చేశారు. జెడ్పీటీసీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ కరుణామయుడు జీసస్ జననం సమస్త ప్రపంచానికి పవిత్ర దినమని ఆమె అన్నారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాస్టర్ల, సంఘపెద్దలు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. సంఘ పెద్దలు శ్రీను, సత్తిబాబు, భీంబాబు తదితరలు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులోని చర్చిల్లో జరిగిన వేడుకల్లో శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం, కొయ్యూరు, మంప, రేవళ్లు, కాకరపాడు, రావణాపల్లి, శరభన్నపాలెం, వంతమర్రి, కునుకూరు, డేగలపాలెంతో పాటు అనేక గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

ఎటపాక: క్రిస్మస్ పండగ సందర్భంగా తెల్లవారు జామున క్రైస్తవ సోదరులు వీధుల్లో కొవ్వొత్తులు చేతబట్టి క్రీస్తు గీతాలను ఆలపించి, సువార్తను చాటారు. ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. హోలీస్పిరిట్ యూత్ ఆధ్వర్యంలో జీకెపాడులో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విందు భోజనాలు ఏర్పాటుచేశారు.



శివలింగపురం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కూనవరం: స్థానిక సీఎస్ఐ చర్చిలో పాస్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- రేగులపాడులో జాన్‌పాల్ ఇమ్మానియేలు, పెంతుకోస్త చర్చిలో రెవరెండ్

కె.జాన్‌బాబు, జీవరత్నంల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రార్థనలు నిర్వహించారు.

రాజవొమ్మంగి: మండలంలోని చర్చిల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని తెలియజేశారు. పేదలకు రగ్గులు, దుస్తులు పంపిణీ చేశారు. విందు భోజనం ఏర్పాటుచేశారు.

వీఆర్ పురం: మండల కేంద్రంలోని చర్చిలో ఫాదర్ డేవిడ్ లివింగ్‌స్టన్, బీసీ కాలనీలోని పాస్టర్ కృపారావు, రేఖపల్లి చర్చిలో పాస్టర్ జోసఫ్, రాజుపేట చర్చిలో పాస్టర్ గాబ్రియల్, సోములగుడెం చర్చిలో పాస్టర్ జాన్ విలియం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పోచవరం, జీడిగుప్ప, పెదమట్టపల్లి, చింతరేవుపల్లి, చినమట్టపల్లి, చొప్పల్లి, రామవరం తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.



రాజేంద్రపాలెం యునైటెడ్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కూనవరం సీఎస్ఐ చర్చిలోని వేడుకల్లో క్రైస్తవులు



వంచంగి గ్రామం చర్చిలో క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు



వీఆర్ పురం చర్చిలో క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

చిట్టినాయుడు సేవలు మరువలేనివి



మాజీ ఎమ్మెల్యే చిట్టినాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నర్సింగరావు

పాడేరు : తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే దివంగత కొట్టగుళ్లి చిట్టినాయుడు గిరిజన ప్రాంత అభివృద్ధికి, గిరిజనులకు చేసిన సేవలు ఎన్నటి మరువలేనివని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మాజీ ఎమ్మెల్యే, సీనియర్ రాజకీయవేత్త కొట్టగుళ్లి చిట్టినాయుడు 12వ వర్ధంతిని సోమ వారం పాడేరులో నిర్వహించారు. మణికంఠం షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట చిట్టినాయుడు కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఏపీ ట్రికార్ చైర్మన్ సతక బుల్లిబాబు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పేదలకు చీరలను పంచి పెట్టారు. దివంగత చిట్టినాయుడు ఆశయ సాధన కోసం పని చేస్తున్నానని, ఆయన అడుగు జాడల్లో నడుస్తున్న తమపై గిరిజనుల ప్రేమాభిరాగాలు మెండుగా ఉన్నాయని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, నాయకులు కొట్టగుళ్లి సుబ్బారావు, రొబ్బి రాము తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సంబరం నేడే ఆరంభం

జి.మాడుగుల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మంగళవారం ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎన్.మత్స్యకొండంనాయుడు తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ కార్యక్రమానికి విచ్చేస్తారని పేర్కొన్నారు. పార్టీ జెడ్పీటీసీ, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, గృహసారథులు, మాజీ సర్పంచ్‌లు హాజరుకావాలని ఆయన కోరారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభం కానున్నట్టు ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వరరావు చెప్పారు. ఈ మేరకు పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఆహ్వానించి కార్యక్రమాల వివరాలను ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ వేడుకలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హరిదాసుల సందడి



రాజవొమ్మంగిలో ఓ ఇంటి ముందు గంట వాయిస్తున్న జంగమ దేవరలు

రాజవొమ్మంగి: నెల గంట మోగింది... గ్రామాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. ఇందులో భాగంగా పల్లెల్లో గంగిరెద్దు, హరిదాసులు, జంగం దేవరలు ఇంటింటికి వచ్చి కుటుంబం చల్లగా ఉండాలని దీవించి, పాటలు పాడుతూ, శంఖం పూరిస్తారు. ఇచ్చిన కానుకలు స్వీకరిస్తారు. ఈ నెలంతా తెలవారకముందే, తెలిమంచుతో శివుని కీర్తిస్తు ఇంటి ముంగిటకు వచ్చే వారికి తృణమో ఫలమో ఇవ్వడం సంప్రదాయం. కాగా రాజవొమ్మంగిలో సోమవారం ఇంటింటికి వచ్చిన జంగం దేవరలను ఆహ్వానించి, తమ పూర్వీకుల పేర్లు చెప్పి దీవెనలు అందుకొన్నారు. భోగి పండుగ వరకు గ్రామాల్లో వారు సంచరిస్తు సంప్రదాయాన్ని ఇనుమడింప చేయడం ఈ కళాకారుల వంశపారంపర్య వృత్తిగా అనాదిగా వస్తోంది.

భక్తిశ్రద్ధలతో భజనలు



ఆలయంలో భజన చేస్తున్న దృశ్యం

మునగపాక : మునగపాక సాంబశివుని ఆలయంలో సోమవారం రాత్రి ప్రత్యేక భజనా కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా నాతవరం ప్రాంతానికి చెందిన భజన బృందం ఇక్కడ భజనలు చేశారు. పలు గీతాలు ఆలపించారు. గీతాలు అందరినీ అలరించాయి. ఆలయం పునర్నిర్మాణం చేపట్టిన తరువాత నాతవరం కళాకారులు ఇక్కడ భజన చేసేందుకు వచ్చి అందరినీ ఆకట్టుకున్నారు.

గ్రామాల్లో మేలుకొలుపు సందడి

మాడుగుల: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం సత్యవరం , గాదిరాయి, ఒమ్మలి, జేడీపేట, కింతలి, ఎం.కోడూరు, జంపెన గ్రామాల్లో మేలుకొలుపులు నిర్వహించారు. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఇందులో భాగంగా తెల్లవారు నుంచి రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.